క్లుప్తంగా

ఆకాశంలోకి రాకెట్ పోతోంది రా!


రాకెట్ లాంఛింగ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: శ్రీహరికోట నుంచి శుక్రవారం మధ్యాహ్నం ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించారు. శ్రీహరి కోట పాఠశాలకు 50 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో రాకెట్ ప్రయోగం విద్యార్థులకు కనిపించడంతో 'ఆకాశంలోకి రాకెట్ పోతోంది రా' అంటూ ఆనందంతో కేరింతలు కొట్టారు. ప్రయోగం సక్సెస్ కావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెంలో ఓ మహిళ అదృశ్యంపై ఫిర్యాదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఫిర్యాదు మేరకు.. మండలంలోని చింతలపాళెం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం భార్య శ్రీలక్ష్మితో కలిసి మేనకోడలు దీప్తి అలియాస్ వసుధ(20) ఈ నెల 12న ఏర్పేడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. అప్పటి నుంచి వసుధ ఇంటికి రాలేదు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, బంధువులు ఇళ్ల వద్ద వెతికారు. తప్పిపోయిన యువతి ఎరుపు రంగు పంజాబీ దుస్తులు ధరించి, 5.3 అడుగుల ఎత్తు కలిగి ఉంటుందని చెప్పారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు తమకు సమాచారం అందించాలని సీఐ చెప్పారు.

నేటి నుంచి పరశురామేశ్వర స్వామి దర్శన వేళలు పెంపు


పరశురామేశ్వర స్వామి ఆలయం

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఉన్న పరశురామేశ్వరస్వామి ఆలయ దర్శన వేళలు శనివారం నుంచి పెంచినట్లు ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. గతంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దర్శన వేళలు ఉన్నట్లు చెప్పారు. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో శనివారం నుంచి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పెంచినట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు, అధికారులు

సత్యవేడు: మండలంలోని పెద్దఈటిపాకం పంచాయతీ రాచపాళెం దళిత వాడలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 8 లక్షలతో నూతనంగా సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. సర్పంచ్ రూబెన్, పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సెల్వి, పార్టీ నాయకులు రమణ, చిన్న ఈటిపాకం సర్పంచ్ గోవిందస్వామి, కమ్యూనిటీ వైద్యశాల కమిటీ సభ్యుడు గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పొరబాట్లకు తావివ్వొద్దు


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

సత్యవేడు: ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు పక్కాగా చేయడానికి బీఎల్‌ఓలకు అఖిల పక్షం నాయకులు సహకారమివ్వాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు కోరారు. శుక్రవారం అఖిలపక్షం నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 169 సత్యవేడు(ఎస్సీ) అసెంబ్లీ నియోజవర్గం ఓటర్ల నమోదుపై ఆయన సమీక్షించారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా మార్పులు-చేర్పులు, ఇంటి నంబరు, ఓటరు పేరు, వయస్సు, వలసలు వెళ్లినా, ఫొటోలు సక్రమంగా లేకున్న కొత్త ఫొటోలు సేకరించి వారి వివరాలు గుర్తిస్తారన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లెవల్‌లో అఖిలపక్షం నాయకులు తమ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్, నవంబర్‌లో నిర్వహించే స్పెషల్ క్యాంపుల్లో కొత్తగా ఓటర్లను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 2024న ఫైనల్‌గా ఓటర్లు జాబితా విడుదల చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే. సుశీల్‌కుమార్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ బోర్డు మెంబరు మునివేలు, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రతాప్, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు, సీపీఎం నాయకులు రమేష్ , తహసీల్దార్ షేక్ జరీనా, డీటీ రవి తదితరులు పాల్గొన్నారు.

సేవకు సలాం

వలంటీర్లకు వందనం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే చేరాయి. టీడీపీ పాలనలో ఒక సర్టిఫికెట్ పొందాలన్నా రోజులు మొదలు వారాల తరబడీ కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఇక పింఛనుదారుల పడిన కష్టాలు చెప్పనలవికావు, గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చి పడిగాపులు కాయాల్సి వచ్చేది. పింఛను మంజూరు చేయండి మహాప్రభో అని మొత్తుకుంటున్నా కనికరించేవారు కాదు. పింఛనుదారుల్లో ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో కొత్త వ్యక్తికి మంజూరు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యలకు చెక్ పెట్టింది. వలంటీర్లతో తెల్లవారుజామునే పింఛనుతో సహా ఇతర సేవలనూ అందిస్తోంది. అందరి ప్రశంసలు అందుకున్న ఈ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొన్నిరోజులుగా విషం చిమ్ముతూనే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు భగ్గుమంటున్నా ఆయన తీరు మారలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలపై కథనం.

–సత్యవేడు/తొట్టంబేడు(శ్రీకాళహస్తి)

అమ్మలా కూతురు లాలన


తండ్రి వ్యాపారంలో తోడుగా ఉన్న వలంటీర్ స్వాతి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఈ.రాధాకృష్ణయ్య. సత్యవేడు నివాసి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కూరగాయల అంగడి, టీ కొట్టు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. 2019లో ప్రజలు కరోనా కేసు అంటేనే హడలిపోతున్న రోజులవి. ఈ క్రమంలో ఆయన కరోనా మహమ్మారి బారిన పడ్డారు. అసలు బతుకుతారో, పోతారో తెలియని పరిస్థితి. రాధాకృష్ణయ్య కూడా భయపడ్డారు. తనకేమైనా అయితే కుటుంబం పరిస్థితి ఏమిటో అని ఒకింత ఆందోళన చెందారు. ఆయన్ని తిరుపతి క్వారంటైన్ సెంటర్‌కు పంపారు. అక్కడ వైద్య పరీక్షలు చేసి15 రోజులు హోం క్వారంటైన్‌లో ఉండాలని, బయటకు వెళ్లకూడదని, మందులు క్రమం తప్పకుండా వాడాలని డాక్టర్లు చెప్పారు. ఆయన ఇంటికి తిరిగొచ్చారు. ఒక గదికే పరిమితమయ్యారు. వలంటీర్‌గా పనిచేస్తున్న ఆయన కుమార్తె స్వాతి అధైర్యపడలేదు. తండ్రికి కరోనా నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటూనే సపర్యలు చేసింది. భౌతిక దూరం పాటిస్తూనే ఆయనతో ఎక్కువ సమయం గడిపేది. ఆయన్ని ఉదయాన్నే నిద్రలేపడం మొదలుకుని రాత్రి పడుకునే వరకు అన్నీ తానై చూసుకుంది. 'అసలే వట్టి మనిషికి కూడా కావు.. నాకేమీ చేయద్దమ్మా..నువ్వూ ఇబ్బంది పడతావు' కడుపు తీపి కొద్దీ తన కుమార్తెను వారించాడు. నీకేం కాదు నాయనా..భయపడొద్దంటూ చేసిన సపర్యలతో ఆయన పూర్తిగా కోలుకున్నారు.

నాన్నకు ప్రేమతో..

నాకు కేటాయించిన 50 ఇళ్లలో మా నాన్న రాధాకృష్ణయ్యకు కరోనా వచ్చిందని ఇంట్లో అందరినీ తిరుపతికి తీసుకెళ్లారు. అందరికీ కరోనా టెస్టులు చేశారు. నాకు, మా అమ్మ, సోదరునికి నెగటివ్ వచ్చింది. మా నాన్నకు పాజిటివ్ రిపోర్టు రావడంతో క్వారంటైన్ సెంటర్‌లో కొన్నిరోజులు ఉంచి ట్రీట్‌మెంట్ ఇచ్చారు. తర్వాత తీసుకోవాల్సిన జాగ్రతలు చెప్పి ఇంటికి పంపించారు. కరోనా ఉందని, రెడ్‌జోన్‌లో ఉన్నారంటూ పోలీసులు మా ఏరియాలోకి ఎవరినీ పంపేవారు కాదు. నిజానికి అప్పుడు నేను 5 నెలల గర్భంతో ఉన్నా. ధైర్యంగా వలంటీర్ విధులు నిర్వర్తించాను. జన్మనిచ్చిన మానాన్నను కాపాడుకున్నా.

–స్వాతి, సత్యవేడు వలంటీర్

ప్రజల్లో మాపై చెక్కుచెదరని నమ్మకం


స్విమ్స్‌లో డయాలసిస్ రోగికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ శారద

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ఈ చిత్రంలో కనిపిస్తున్న వలంటీర్ పేరు శారద. తొట్టంబేడు మండలం పూడి సచివాలయం పరిధిలో విధులు నిర్వర్తిస్తోంది. కరోనా మహమ్మారి అతలాకుతలం చేసినప్పటి నుంచి ఇప్పటివరకు నిబద్ధతతో సేవలు అందిస్తోంది. తిరుపతి, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వైద్య సేవలు పొందుతున్న వారికి తన సొంత ఖర్చులతో వెళ్లి వారికి అత్యవసర సమయంలో పింఛను అందజేసి లబ్ధిదారులతోపాటు అధికారుల మన్ననలు అందుకుంది. వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ ఎంతగా విషం కక్కినా, ఇప్పటికీ పదే పదే దుష్ప్రచారం చేస్తున్నా ప్రజల్లో తమపై చెక్కుచెదరని నమ్మకం ఉందని, తమ సేవలను వారి నుంచి ఎవరూ దూరం చేయలేరని ఘంటాపదంగా చెబుతోంది.

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం

శ్రీకాళహస్తి: శ్రీహరికోటలోని ఇస్రో స్పేస్ సెంటర్‌లో శుక్రవారం ప్రయోగించిన చంద్రయాన్ విజయవంతంపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం కావడం సంతోషకరమన్నారు. ఇలాంటి ప్రయోగాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు.

సద్దికూడు మడుగు పనులను పరిశీలించిన ఇరిగేషన్ ఎస్ఈ


పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సద్దికూడు మడుగు చెరువు పనులను ఇరిగేషన్ ఎస్ఈ విజయ్ కుమార్, ఈఈ మదన్ గోపాల్ శుక్రవారం పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ జైకా నిధులు రూ.4.60 కోట్లతో చేయనున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడాలని ఏఈ మురళీమోహన్‌ను ఆదేశించారు. అనంతరం పిచ్చాటూరులో అరణియార్ వద్ద తుడా నిధులు రూ.1.82 కోట్లతో చేస్తున్న పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమౌతున్న నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు డీఈ రత్నారెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు లేన్ల హైవేకు సర్వీస్ రోడ్డు, అండర్ పాస్ ప్లీజ్!


కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, పక్కన కాంట్రాక్టర్ శంకర్ రెడ్డి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- కారూరు వద్ద రోడ్డు పనుల పరిశీలన

పిచ్చాటూరు: చిత్తూరు-తచ్చూరు ఆరు లేన్ల హైవే రోడ్డుకు పిచ్చాటూరు మండలంలోని కారూరు వద్ద సర్వీస్ రోడ్డు, అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. గత వారం కారూరు ప్రజలు ఎమ్మెల్యేని కలిసి సమస్యను నివేదించారు. తమ గ్రామానికి ఆనుకుని ఆరులేన్ల హైవే వెళ్తుందని, తమ పొలాలు రోడ్డుకు అవతలి వైపు ఉన్నాయని, అయితే రోడ్డును దాటడానికి వీలు లేని పరిస్థితి ఉంటోందని, తాము వెళ్లేందుకు అండర్‌పాస్, సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన పనులు చేస్తున్న కాంట్రాక్టర్ శంకర్ రెడ్డితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం కారూరు వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డును పరిశీలించారు. పరిస్థితిని ఆయనకు వివరించారు. అనంతరం అక్కడ నుంచి కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. ఈ హైవేలో ఒక్క చోట కూడా సర్వీసు రోడ్డు, అండర్ పాస్‌లు లేవని, దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, మండలానికి మధ్యలో ఉన్న కారూరు వద్ద సర్వీసు రోడ్డు, అండర్ పాస్‌లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, వైఎస్ఆర్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, కారూరు మాజీ సర్పంచ్ ఆర్ముగం రెడ్డి, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ మురళీరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రాజారెడ్డి, చలపతి రాజు, మోహన్, దేశప్పన్, కారూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురి ఎంపిక


రూనీస్, గ్రీష్మ కుమారి, గురుసందీప్, తరుణ్

వరదయ్యపాళెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఈఓ సరస్వతి తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వి.రూనీస్, వి.గ్రీష్మ కుమారి, కె. గురుసందీప్, డి.తరుణ్ ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

డాక్టర్ బీఎస్ రావుకు అశ్రునివాళి


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల వద్ద ఆ సంస్థ అధినేత డాక్టర్ బీఎస్ రావుకు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డాక్టర్ బీఎస్ రావు తన సతీమణి డాక్టర్ ఝాన్సీల క్ష్మీబాయితో కలిసి పలు దేశాల్లో వైద్యసేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ రూపాదేవి, ఏజీఎం సురేష్, డీన్ సుబ్రహ్మణ్యం, కల్పన, జానకి, సురేష్‌రెడి పాల్గొన్నారు.

నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు: నాగలాపురం సురుటపల్లి పళ్లికొండేశ్వరాలయంలో, పిచ్చాటూరు మండలం సిద్ధిరాజు కండ్రిగలోని శ్రీ సోమనాథేశ్వరాలయాల్లో శనివారం త్రయోదశిని పురస్కరించుకుని నందీశ్వరునికి మహా ప్రదోష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయాల ధర్మకర్తలు తెలిపారు. ఈ పూజలకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

పవన్ క్షమాపణ చెప్పాలి


నిరసన తెలుపుతున్న వలంటీర్లు

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలంటూ శ్రీకాళహస్తిలో వలంటీర్లు నిరసన తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎక్కడో ఒక దగ్గర జరిగితే మొత్తం వ్యవస్థకు అన్వయించి మాట్లాడటం బాధకరమన్నారు. జనసైనికులు ఒక దొంగతనం చేస్తే మొత్తం జనసేన పార్టీ దొంగపార్టీ అవుతుందా? అని ప్రశ్నించారు. అలాగే ఎవరో ఒకరు తప్పు చేస్తే మొత్తం వ్యవస్థకు అన్వయించి మాట్లాడటం సరికాదన్నారు. నిరుద్యోగులైన తాము ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. కరోనా సమయంలో జనసైనికులు బయటకు రాలేదని సేవలు అందించింది తామే అన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహుకేతు పూజలు చేయించుకుంటున్న శ్రీముఖి, ముక్కంటి దర్శనానికి విచ్చేసిన సాయి ధరమ్‌తేజ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం పలువురు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీ హీరో సాయి ధరమ్‌తేజ్, ప్రముఖ యాంకర్ శ్రీముఖి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు యాంకర్ శ్రీముఖి ప్రత్యేక రాహుకేత, సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు.

నాగలాపురం మండలంలోఎమ్మెల్యే పర్యటన

- వలంటీర్, విద్యార్థి మృతదేహాలకు నివాళి
- మరో ఇద్దరు వైఎస్ఆర్‌సీపీ నేతల పరామర్శ


వలంటీరు సతీష్ భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: నాగలాపురం మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించారు. అనారోగ్యం కారణంగా చికిత్స పొంది నాగలాపురం బీసీ కాలనీలో ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న వైఎస్ఆర్‌సీపీ నేత ఉదయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం విద్యార్థి తులసీరామ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని తల్లిదండ్రులను ఓదార్చారు. ఆ తర్వాత వెళ్లూరుకు వెళ్లి పార్టీ నాయకుడు మునివేలును పరామర్శించారు. అలాగే, జానికాపురానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గ్రామ వలంటీర్ సతీష్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. వలంటీర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అపరంజి రాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, వైఎస్ఆర్ టీయూసీ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాయకులు దేశప్పన్, ఈశ్వర్, దేశన్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు


స్మార్ట్ డిస్‌ప్లే బోర్డు ఇస్తున్న అకిరా మత్సుద

సత్యవేడు: కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా శ్రీసిటీలోని జపనీస్ కంపెనీస్ అసోసియేషన్(ఎస్‌జేసీఏ) ఇరుగుళం, మాదనపాళెం జెడ్పీ హైస్కూళ్లకు అధునాతన స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులను వితరణ చేసింది. జపనీస్ కంపెనీ అసోసియేషన్ చైర్మన్ అకిరా మత్సుద ప్రధానోపాధ్యాయులకు వీటిని అందజేశారు. ఒక్కో స్మార్ట్ డిస్‌ప్లే బోర్డు విలువ రూ.2.4 లక్షలని చెప్పారు. శ్రీసిటీ ఆవిర్భావం నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని, విద్యా ప్రమాణాల పెంపునకు శ్రీసిటీ నిరంతరం సహకారం అందిస్తున్నట్లు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) రమేష్‌కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీ టీచర్లకు వీడ్కోలు సత్కారం


టీచర్లను సత్కరిస్తున్న హెచ్ఎం తదితరులు


సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ రవి


పిచ్చాటూరు: అడవికండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూలు నుంచి బదిలీ అయిన హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు వాణి, మోహన్‌బాబు, రామక్క, స్వామిదాసును శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం రూపేష్‌కుమార్, పీసీ చైర్మన్ మునెయ్య, టీచర్లు యువశ్రీమురళి, సురేష్ బాబు, ఎన్ మురళి, ప్రసాద్, వేణుగోపాల్, దేవేంద్ర, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

వీడ్కోలు సన్మానం

సత్యవేడు: ఉద్యోగోన్నతిపై నంద్యాలలోని బేతంచర్ల బాలుర గురుకుల పాఠశాలకు సూపరింటెండెంట్‌గా వెళుతున్న ఏ.సంజీవనాయుడును ఎంఈఓ కే.రవి, బాలుర 'గురుకుల' ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయలు దండపాణి, మాధవి, సురేష్, మునిచంద్రుడు, మురుగన్, పవన్ పాల్గొన్నారు.

అడవికండ్రిగలో..

పిచ్చాటూరు: అడవికండ్రిగ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న టీచర్ పవన్‌ను రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు శోభన్‌బాబు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

నారాయణవనం: స్వయం ఉపాధికి యువతకు చేతి వృత్తులపై ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించి, రుణాలను అందజేస్తామని యూనియన్ బ్యాంకు ప్రతినిధి సురేష్ అన్నారు. శుక్రవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘమిత్రల సమావేశం ఏపీఎం మమత నిర్వహించారు. ముఖ్య అతిథిగా సురేష్ మాట్లాడారు.యువతకు వివిధ చేతి వృత్తులపై వారం నుంచి నెల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వ సతి, భోజన వసతి కల్పిస్తామని, ఉచిత మెటీరియ ల్ ఇస్తామన్నారు. మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, జూట్ బ్యాగ్స్ తయారీ, మసాలా, ఊరగాయలు, పచ్చళ్లు, కొవ్వొత్తుల తయారీ, కంప్యూటర్ హార్డ్ వేర్, నెట్‌వర్కింగ్, పాడి ఉత్పత్తులు, వర్మీ కంపోస్ట్ తయారీ, పురుషులకు ద్విచక్ర వాహనాలు, ఏసీ, రిఫ్రిజరేటర్, సెల్‌ఫోన్ సర్వీసింగ్, డిజిటల్ ఫొటోగ్రఫీ, ట్యాలీ అకౌంటింగ్, పాడి, వర్మీ కంపోస్ట్ తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. 30 మంది పేర్లు నమోదు చేసుకుంటే వారి ప్రాంతంలోనే శిక్షణఇస్తామన్నారు.

సురక్షతో ప్రజలకు ఉచిత సేవలు



పూడిలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి, ఏర్పేడు: అంజిమేడులో సర్టిఫికెట్ అందజేస్తున్న తిరుమలయ్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): జగనన్న సురక్షతో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలు అందిస్తున్నారని, దీంతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పూడి, రౌతు సురమాల సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆమె హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యఉద్దేశం అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. గతంలో మన సమస్య చెప్పుకోవడానికి అధికారులు, నాయకులు అందుబాటులో ఉండేవారు కాదన్నారు. ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా అధికారులే నేరుగా మీ ఇంటి గుమ్మం వద్దకు వచ్చి సమస్య అడిగి తెలుసుకుని మరీ వాటిని పరిష్కరిస్తున్నారని తెలిపారు. మీకు ఏ సహాయం కావాలన్నా ఎమ్మెల్యే కార్యాలయంలో ఎల్లప్పుడూ మీకోసం అందుబాటులో ఉంటామని తెలిపారు. అనంతరం పూడిలో 891 మందికి, రౌతు సూరమాలలో 715 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు అర్చనాదేవి, ఎంపీటీసీ సభ్యుడు గురుస్వామినాయుడు, సర్పంచ్ మునెమ్మ, లక్ష్మి, నాయకులు నరసింహనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి భక్తవత్సలం, వెంగళరావు, గజేంద్రరెడ్డి, నాగరాజు, బుజ్జిరెడ్డి, మురళి, వెంకటేష్ తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఇంటివద్దకే సంక్షేమ ఫలాలు

ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలు ఇంటి వద్దనే అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అంజిమేడు, పాతవీరాపురం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రభుత్వ పరంగా పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు చెబితేనే అందేవన్నారు. అదికూడా వారు చెప్పిన వారికే అందేవన్నారు. కానీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, జాతి రాజకీయాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అంజిమేడులో 830 మందికి, పాతవీరాపురంలో 790 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్దన్‌రెడ్డి, జమళ్ల శ్రీనివాసులు, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, మంజుల, ఉప సర్పంచ్ తేజోవతి, లోకనాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు బాలగురునాథంరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదరంరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య పాల్గొన్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ: తలారివెట్టులో..

లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

శ్రీకాళహస్తి: జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జున్‌గౌడ అన్నారు. పట్టణంలోని పీవీరోడ్ 9వ వార్డు సచివాల పరిధిలో జగన్న సురక్ష కార్యక్రమం ఇన్‌చార్జి కమిషనర్ ఉమామహేశ్వరరావు, కన్వీనర్లు ఎస్‌కే గఫూర్, ఎం మాధవి, ఎస్‌కే అమన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శ్రీనివాసులు, రవికాంత్, బాలచంద్రయాదవ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి సైతం లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశమని ఎంపీడీవో నరసింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని తలారివెట్టు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. డీటీ శివయ్య, వ్యవసాయాధికారిణి భారతి, ఏడీ మునిరాజా, నాయకులు సుందర్‌రెడ్డి, హరిగోపాల్‌రెడ్డి, తిరుపాల్, భాస్కరయ్య పాల్గొన్నారు.